144 సెక్షన్ అమలు : ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మే 10: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉందని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఈనెల 11వ తేదీ ఉదయం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా తిరుగొద్దన్నారు.


హాజరైన జనం

దొంగలెవరో.. దొరలెవరో
తేల్చుకుందాం!

ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- అవినీతిని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- డీకే అరుణ కుటుంబ అవినీతి బయటపడితే క్షమాపణ చెప్తారా
- ప్రాజెక్టులకు పైసా ఇవ్వని బీజేపీకి ఓటు వేయాలా
- మత సామరస్యాన్ని కాపాడే కాంగ్రె‌స్‌కు ఓటు వేయండి
- షాద్‌నగర్‌కు మెట్రోరైలు.. అభివృద్ధికి నిధులు
- షాద్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

షాద్‌నగర్/ షాద్‌నగర్‌అర్బన్/ కొత్తూర్, మే 10: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాజకీయాలను అడ్డం పెట్టుకుని అవినీతికి, దోపిడీకి పాల్పడిన దొంగలెవరో, దొరలెవరో తేల్చుకోవడానికి ముందుకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీకి సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వంశీచంద్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి షాద్‌నగర్ పట్టణంలో రోడ్‌షోను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయకపోగా ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి వంశీచంద్

తనపై అవినీతి ఆరోపణలు చేయడమేంటని ప్రశ్నించారు. డీకే అరుణ కుటుంబం రాజకీయాలను అడ్డం పెట్టుకుని కల్తీకల్లు, దొంగసారా వ్యాపారం చేయడమే కాకుండా కంకర, ఇసుక దందా, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు, వైన్‌షాపుల నుంచి మామూళ్లు వసూలు చేసిన విషయం జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. తాను జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ఏ ఒక్కరి నైనా పైసా అడిగినా తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయమై షాద్‌నగర్ చౌరస్తాలోనే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసి, ఓటింగ్ పెడదామా అని సవాల్ చేశారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని అవినీతికి ఎవరు పాల్పడ్డారో తేల్చడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే షాద్‌నగర్ చౌరస్తాలో అంబేద్కర్ సాక్షిగా ముక్కు నేలకు రాస్తానని, డీకే అరుణ కుటుంబ అవినీతి బయట పడినట్లు నిరూపితమైతే ప్రధాని మోదీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా వచ్చిన తాను ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దాలన్నింటినీ అమలు పరుస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. రైతుల ఖాతాల్లో రైతుబంధును వేశానని చెప్పారు. కులమతాల మధ్య చిచ్చును, మనుషుల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయం చేస్తానంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను సహించబోనని హెచ్చరించారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెలో పెట్టుకునే వారే నిజమైన హిందువన్నారు. కులమతాలతో సంబంధం లేకుండా మనుషులందరూ కలిసి ఉంటేనే ప్రాజెక్టులు, పరిశ్రమలు వచ్చి తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశానికి స్వాతంత్రం రాగానే హైదరాబాద్ ముఖ్యమంత్రిగా షాద్‌నగర్‌కు చెందిన బూర్గుల రామకృష్ణారావు పనిచేశారని, ఆ తరువాత 70 సంవత్సరాలకు పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లు సహించలేక కుట్రలు చేస్తున్నారని రేవంత్ అన్నారు. సీఎంగా తాను ప్రాతినిధ్యం

మిగతా 8వ పేజీలో...



ష్.. గప్‌చుప్..

- నేటితో ముగియనున్న ప్రచార పర్వం
- దూకుడు పెంచిన ప్రధాన పార్టీలు
- రంగంలోకి దిగిన అగ్రనేతలు



రంగారెడ్డి అర్బన్/ వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి), మే 10 : లోక్‌సభ ఎన్నికల ప్రచారం పర్వం నేటితో ముగియనుంది. ఇక ప్రచారానికి కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మరింత దూకుడు పెంచాయి. వీలైనంత ఎక్కువగా ప్రజల్లోకి వెళ్లేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రచారానికి అధిక సమయం కేటాయిస్తున్నారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, మేజర్‌గ్రామ పంచాయతీల్లో రోడ్‌షోలు, బైక్ ర్యాలీలు చేపడుతున్నారు. ప్రచారపర్వం ముగియనుండటంతో నేతల మాటలు తూటాలుగా పేల్చుతున్నారు. అధికారం తమదేనని ప్రధాన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ బరిలో 43 మంది, మల్కాజ్‌గిరి పరిధిలో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పటి వరకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ప్రచారంలో ఢీ అంటే ఢీ అంటున్నారు. ఈ నెల 13న సోమవారం పోలింగ్ జరుగనుండడంతో నేటి సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగియనుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి, గౌతమ్‌లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు, మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించడం అభ్యర్థులకు సాధ్యపడలేదు. ఎక్కడికక్కడ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండనుంది. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లా యేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండకూడదని ఎన్నికల అధికా రి స్పష్టం చేశారు. కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌లు తనిఖీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మద్యం షాపులను మూసివేయనున్నారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధించింది. ఎన్నికల ప్రచారం గడువు నేటి సాయంత్రానికి ముగియనుండటంతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ప్రచార హోరు పెరిగింది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగుల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్ షోల్లో పాల్గొన్నారు. నేడు వికారాబాద్ జిల్లాకు అగ్రనేతలు తరలివస్తున్నారు. వికారాబాద్‌కు అమిత్‌షా, తాండూరుకు ప్రియాంక గాంధీ విచ్చేస్తున్నారు.

చేవెళ్ల ఓటరు తీర్పు విలక్షణం..

రాష్ట్ర రాజధానిని ఆనుకుని ఉన్న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. చేవెళ్ల ఓటర్లు ఇప్పటికే విలక్షణ తీర్పు ఇచ్చారు. పట్టణ, గ్రామీణ భరితంగా ఉన్న ఓటర్లు కాంగ్రెస్‌కు ఒకసారి, రెండుసార్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. ఈ సారి విజయం మాదంటే మాదంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల రణరంగంలో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సారి చేవెళ్ల ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందనే విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

- తొలి ఎంపీ దివంగత సూదిని జైపాల్‌రెడ్డి
- నియోజకవర్గంలో ఇప్పటివరకు మూడుసార్లు ఎన్నికలు
- ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపు
- హ్యాట్రిక్ విజయం కోసం బీఆర్ఎస్ వ్యూహాలు
- ఇప్పటి వరకు ఒక వ్యక్తికి ఒకసారి మాత్రమే అవకాశం
- ఈ సారి త్రిముఖ పోటీ
- ఓటరు తీర్పుపై తీవ్ర ఉత్కంఠ

2008లో లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భావం.. 2009లో మొదటిసారి ఎన్నికలు


రంజిత్‌రెడ్డి
విశ్వేశ్వర్‌రెడ్డి
జ్ఞానేశ్వర్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిఅర్బన్/వికారాబాద్, మే 10 : చేవెళ్ల నియోజకవర్గ ఓటర్ల తీర్పు విలక్షణంగా ఉంటుంది. ఇక్కడ నుంచి ఒకే వ్యక్తి వరుసగా రెండుసార్లు గెలిచిన దాఖలాలు లేవు. 2019లో జరిగిన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ పడ్డారు. రంజిత్‌రెడ్డిపై 'కొండా' స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ సారి పోటీదారులు మారలేదు.. కానీ.. వారు పోటీ చేస్తున్న పార్టీలు మారాయి. రెండోసారి ప్రత్యర్థులుగా బరిలో దిగి కత్తులు దూసుకుంటున్నారు. వీరిద్దరికి గట్టి పోటీతో పాటు సిట్టింగ్ స్థానాన్ని చేజార్చుకోకుండా బీఆర్ఎస్ బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌నురంగంలోకి దింపింది. 2009లో కాసాని జ్ఞానేశ్వర్ మనపార్టీని స్థాపించి ప్రజారాజ్యం ఎత్తుతో చేవెళ్ల నుంచి బరిలో దిగారు. ప్రస్తుతం మూడు పార్టీలు తమదైన వ్యూహాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ బీసీనినాదం, కాంగ్రెస్ అభివృద్ధి మంత్రం, బీజేపీ మోదీ హవాతో ప్రజల్లోకి వెళుతున్నాయి.

పాగా కోసం హస్తం పార్టీ పావులు

2009లో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ ప్రభావం

మిగతా 8వ పేజీలో...

సర్వం సిద్ధం


వికారాబాద్‌లో అమిత్ షా బహిరంగ సభ కోసం సిద్ధమైన వేదిక

- నేడు వికారాబాద్ జిల్లాకు బీజేపీ, కాంగ్రెస్ అగ్ర నేతలు రాక
- వికారాబాద్‌కు అమిత్ షా, తాండూరుకు ప్రియాంక
- జన సమీకరణకు సన్నాహాలు.. పూర్తయిన ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/తాండూరు, మే 10 : నేడు వికారాబాద్ జిల్లాకు జాతీయ పార్టీల అగ్ర నేతలు రానున్నారు. వికారాబాద్ పట్టణంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, తాండూరు పట్టణంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. అమిత్ షా శనివారం ఉదయం 10.30 గంటలకు బేగంపేట్ ఎయిర్ పోర్ట్ నుంచి బయలుదేరి 10.50 గంటలకు ఎస్ఏపీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 11 గంటలకు బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. అమిత్ షా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అమిత్‌షా పర్యటన వికారాబాద్‌లో 45 నిమిషాల పాటు కొనసాగనుంది. ఉదయం 11.55 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి వనపర్తికి బయలుదేరి వెళ్లనున్నారు. అమిత్ షా బహిరంగ సభ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇప్పటికే అమిత్ షా కోసం ప్రత్యేకంగా హెలీప్యాడ్ ఏర్పాటు చేయగా, ఆయనతో పాటు వికారాబాద్‌కు వచ్చే జాతీయ మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మరో హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో ఆ పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకుడు బి.జనార్దన్‌రెడ్డి, జిల్లాఅధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ఈ సభకు 75 వేల మందిని సమీకరించేలా పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.


తాండూరులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, వేం నరేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

ప్రియాంక సభకు ఏర్పాట్లు పూర్తి

తాండూరు పట్టణంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పర్యటనకు

మిగతా 8వ పేజీలో...

మనదే విజయం!


ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సభలో ప్రధాని మోదీతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థులు కొండా, ఈటల

పార్లమెంటు ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకోవడంతో శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బీజేపీ జనసభ నిర్వహించింది. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరై ప్రసగించారు. కాగా సికింద్రాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్, చేవెళ్ల, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ ఎంపీ అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ వేదికపై ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలతో విజయావకాశాలపై చర్చించారు.

మొరాయించిన కంప్యూటర్..
ఎంసెట్ రాయలేకపోయిన విద్యార్థిని



కేశంపేట, మే 10(ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ మొరాయించడంతో ఓ విద్యార్థిని ఎంసెట్ రాయలేకపోయింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన నిదురం సంగీత(హాల్ టికెట్ నెంబరు-ఎ142214698ఎ5) గురువారం నిర్వహించిన తెలంగాణ ఎంసెట్(ఇంజనీరింగ్ విభాగం) రాసేందుకు హాజరైంది. ఈ మేరకు మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాస్తుండగా కంప్యూటర్ మొరాయించినట్లు విద్యార్థిని తెలిపింది. దాంతో ఆమె పూర్తిస్థాయిలో పరీక్ష రాయలేక పోయానని, తనతో పాటు మరికొంత మందికి కూడా కంప్యూటర్ సమస్యలు ఎదురైనట్లు తెలిపింది. పరీక్ష నిర్వహణలో లోపం ఉన్నందున మరో అవకాశం కల్పించాలని కోరింది.

దొంగలెవరో... దొరలెవరో
తేల్చుకుందాం!

(ఏడో పేజీ తరువాయి)

వహిస్తున్న సెగ్మెంట్‌లోని మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్‌కు ఓటువేసి ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి అవకాశం ఇచ్చిన మహబూబ్‌నగర్ ప్రాంత ప్రజలు ఎంపీగా తనను గెలిపింపి, మీ రుణం తీర్చుకునే అవకాశం కల్పించాలని కోరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్‌కు పీజీ కళాశాలను, ఈఎస్‌ఐ ఆసుపత్రిని మంజూరు చేసి, పట్టణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

షాద్‌నగర్‌కు మెట్రోరైలు : సీఎం హామీ

షాద్‌నగర్ పట్టణానికి మెట్రోరైలును వేయించి నగరంగా అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే ఆర్‌పోబీని పూర్తి చేయిస్తానని, మున్సిపాలిటీ అభివృద్ధికి 30 కోట్ల నిధులు ఇస్తానని తెలిపారు.

సీఎం పర్యటన సక్సెస్

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతమైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకుని హెలిక్యాప్టర్‌లో వచ్చిన సీఎం ముందు కేశంపేట చౌరస్తా నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు రోడ్‌షోను నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. సీఎం వస్తున్న కార్యక్రమానికి వేలాదిగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. సీఎం పర్యటనలో భాగంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, నాయకులు

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్యతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి హెలీప్యాడ్ వద్దకు పలువురు నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్యతో పాటు, ఫరూఖ్‌నగర్ మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్‌గౌడ్, బాలానగర్ మాజీ జడ్పీటీసీ సాయికృష్ణలతో పాటు పలువురు సీఎం సమక్షంలో పార్టీలో చేరగా, వారికి రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చేవెళ్ల ఓటరు తీర్పు విలక్షణం..

(ఏడో పేజీ తరువాయి)

చూపించలేక పోయింది. 2014లో తెలంగాణ ఉద్యమం ఉధృతితో ఈ సీటు గులాబీ వశమైంది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఐదేళ్లు బీఆర్‌ఎస్ ఎంపీగా పనిచేసి 2019 ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి ఆ పోరులో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకోవడంతో ఈ సారి చేవెళ్లలో పాగా వేయాలని ఆ పార్టీ పావులు కదుపుతోంది. సిట్టింగ్ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుని గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నారు. చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులో ఎమ్మెల్యేల సమన్వయంతో ఓటర్లను రంజిత్‌రెడ్డి ఓటర్లను తమవైపు తిప్పుకనే ప్రయత్నం చేస్తున్నారు.

హ్యాట్రిక్ కోసం బీఆర్‌ఎస్ యత్నం..

వరుసగా రెండుసార్లు విజయం సాధించిన బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీలో మనోధైర్యం నింపేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఈసారి బీసీలకు టికెట్ ఇచ్చామని ప్రజల్లోకి వెళుతుంది. ముదిరాజ్ ఓట్లు కలిసి వస్తాయని బీఆర్‌ఎస్ భావిస్తోంది. క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేయడంతో కాసానికి అన్నివర్గాల్లో మంచి సంబంధాలు ఉన్నాయి. అంతే కాక బీసీ వర్గాల్లో కాసానికి పట్టుఉండడంతో బీఆర్ ఎస్ బీసీ ఓటర్లపై గంపెడాశలు పెట్టుకుంది.

పోటీలో కోటీశ్వరులు

ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే బీఆర్ఎస్ అధిష్టానం తమ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిని ప్రకటించింది. అయితే, ఆయన కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరపున పోటీలో నిలవడంతో బీఆర్‌ఎస్ టికెట్ జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌కు కేటాయించారు. బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో నిలిచారు. వీరి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. లోకసభ బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ కోటీశ్వరులే. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రూ.4,490 కోట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి రూ.869.77 కోట్లు, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు రూ.520.70 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు..

ఇదీ నియోజకవర్గ చరిత్ర

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఈ నియోజకవర్గం 2008లో ఏర్పడింది. అంతకుముందు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో భాగంగా ఉండేది. 2009లో మొదటి సారిగా చేవెళ్ల ఎంపీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. మొదటి ఎంపీగా సూదిని జైపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ, కేంద్ర పెట్రోలియం, సహజ వాయుశాఖ మంత్రిగా పదవి చేపట్టారు. 2019 జూలై 28న ఆయన మృతి చెందారు. జైపాల్‌రెడ్డి తర్వాత 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. 2019లో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హస్తం గుర్తుపై బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓటమిని చవిచూశారు. టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన గడ్డం రంజిత్‌రెడ్డి విజయ దుందుభి మోగించారు.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహేశ్వరం	2,85,137	2,71,538	66	5,56,741
రాజేంద్రనగర్	3,16,979	2,95,153	38	6,12,170
శేరిలింగంపల్లి	4,00,361	3,57,600	141	7,58,102
చేవెళ్ల	1,35,429	1,34,526	5	2,69,960
పరిగి	1,33,568	1,32,989	9	2,66,566
వికారాబాద్	1,14,965	1,16,660	14	2,31,639
తాండూరు	1,17,821	1,25,364	7	2,43,192
మొత్తం	1,504,260	14,33,830	280	29,38,370

రెండు సార్లు కారు, ఒకసారి హస్తం

2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ గాలి వీచినా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం కారు జోరు కనిపించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం స్థానం ఏర్పడ్డాక మొదటి సారిగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించగా, 2014, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ సత్తాను చాటారు.

ఆ రెండు నియోజకవర్గాల్లో మహిళలే కీలకం

ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,31,639 ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓట్లు 116,660 ఉన్నాయి. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,192 ఉండగా అందులో మహిళా ఓటర్లు 1,25,364 ఉన్నారు. శేరిలింగంపల్లిలో అత్యధిక ఓట్లు

ఈ నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక ఓట్లున్నాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 7,58,102 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 4,00,361, మహిళలు 357,600, ఇతరులు 141మంది ఉన్నారు.

ఇప్పటి వరకు జరిగిన చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల వివరాలు

సంవత్సరం	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ	వచ్చినఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు
2009	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్	4,20,807	జితేందర్‌రెడ్డి	టీడీపీ	4,02,275
2014	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	టీఆర్‌ఎస్	4,35,077	పి. కార్తీక్‌రెడ్డి	కాంగ్రెస్	3,62,054
2019	గడ్డం రంజిత్‌రెడ్డి	టీఆర్‌ఎస్	5,28,148	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	కాంగ్రెస్	5,13,831

సర్వం సిద్ధం

(ఏడో పేజీ తరువాయి)

సర్వం సిద్ధం చేశారు. ప్రియాంక గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, తదితరులు పాల్గొననున్నారు. శనివారం మధ్యాహ్నం 1.15 గంటలకు తాండూరులో పీపుల్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి విలియమ్ మూన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ వేదిక వద్దకు వస్తారు. మధ్యాహ్నం 2.05 గంటల వరకు సభ కొనసాగనుంది. అనంతరం 2.10 గంటలకు తాండూరు నుంచి హెలీక్యాప్టర్‌లో బేగంపేట్ ఏయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లనున్నారు. సభ ఏర్పాట్లను శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు పరిశీలించారు.

ప్రియాంక గాంధీ సభకు భారీగా జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని వేం నరేందర్‌రెడ్డి పార్టీ ముఖ్య నాయకులకు సూచించారు.

ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా పథకాల అమలు: స్పీకర్ ప్రసాద్ కుమార్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఆరు గ్యారంటీల అమలుతో పాటు రుణమాఫీ కోసం దేవుళ్లపై ఒట్టేసి ప్రమాణం చేసి ప్రజలకు చెపుతున్నామని శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం తాండూరు బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వనాశనం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ప్రియాంకా గాంధీ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 14 నుంచి 15 ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4వ తేది తర్వాత అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సుమారు లక్ష మందితో ప్రియాంక గాంధీ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.

కారు గెలవాలని జనం కోరుతున్నారు

- మల్కాజిగిరి చక్రబంధాన్ని తొలగించి అభివృద్ధికి బాటలు వేస్తా
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి



ఉప్పల్, మే10(ఆంధ్రజ్యోతి): 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరాన్ని బీఆర్‌ఎస్ సర్కారు అభివృద్ధిలో ప్రపంచస్థాయిలో నిలిపింది. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కారు పార్టీని గెలిపించాలని నిర్ణయించుకున్నారు' అని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. 'సార్ కావాలి.. కారు గెలవాలి' అనే నినాదంతో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు.వందరోజుల కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి, బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకమే నా విజయానికి తొలిమెట్టు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధే బీఆర్‌ఎస్‌ను గెలపించబోతుంది.

జనం ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటి పరిష్కారానికి మీ చర్యలు..

ప్రధానంగా మల్కాజిగిరి ప్రాంతం రైల్వేట్రాక్‌లకు మధ్యలో ఉండటంతో ఇక్కడి ప్రజలు చక్రబంధంలో ఇరుక్కున్నారు. గేటు పడితే గంటల పాటు ట్రాఫిక్‌లోనే అవస్థలు పడుతున్నారు. వాటి సమస్యకు ఆర్వోబీలు తీసుకొచ్చి పరిష్కరిస్తాం. కంటోన్మెంట్ ప్రాంతవాసులు రోడ్ల విస్తరణ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ ప్రధాన రహదారి కూడా విస్తరణకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో ఏళ్లగా ఉప్పల్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

మీకు పోటీ ఎవరని భావిస్తున్నారు..?

బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ నాకు పోటీ కాదు. ఏడు అసెంబ్లీల పరిధిలో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు సీరియస్‌గా నా గెలుపు కోసం పనిచేస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఒక దిష్టిబొమ్మ అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కానీ రాష్ట్రానికి సీఎం రేవంత్‌నే పెద్ద దిష్టిబొమ్మగా మారారు. కరోనా సమయంలో కూడా మల్కాజిగిరి ప్రజల బాగోగులు పట్ల ఆరా తీసిన దాఖలాలు లేవు.

బీఆర్‌ఎస్ నుండి ఇతరపార్టీల్లో చేరికలతో నష్టం లేదా..?

ప్రజల సొమ్ము దోచుకున్న అవినీతిపరులు బీజేపీ గూటికి వెళ్తే వారికి క్లీన్‌చిట్ ప్రకటిస్తుంది. వాషింగ్ పౌడర్ నిర్మా మాదిరిగా వారిని ఆదరిస్తుంది. బీజేపీ దేశానికి పట్టిన దరిద్రంగా తయారైంది. ఎవరి ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించబోతున్నారు.

రంజిత్‌రెడ్డికి 50 వేల మెజారిటీ ఇస్తాం



వికారాబాద్ : వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

పరిగి, మే 10: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జి.రంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం పరిగి మండలం సుల్తాన్‌పూర్, ఖుదాంద్‌పూర్, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల పరిగిలో 25 వేల మెజార్టీ వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికకు 50 వేలకుపైగా మెజార్టీ ఇస్తామని చెప్పారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీగా రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. మండలాధ్యక్షుడు పరుశరాంరెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, తదితరులున్నారు.

ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణమాఫీ

పూడూరు/యాలాల/బషీరాబాద్/ : ఆగస్టు 15 నాటికి రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం పుగుడుర్తిలో ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో పగిడ్యాల్ గ్రామ ఎంపీటీసీ ప్రభాకర్ (సి.రాములు) కాంగ్రెస్‌లో చేరారు. వడ్ల కలప్ప చారి, ఉపసర్పంచ్ నర్సిములుగౌడ్, తదితరులున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం.రమేష్ అన్నారు. బషీరాబాద్ మండలం మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్ గ్రామాల్లో పర్యటించారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రజలు, పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశమై చర్చించారు. మాజీ జడ్పీటీసీ రాకేష్, మండలాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, తదితరులున్నారు. వికారాబాద్ జిల్లా కోఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా యాలాల మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీలు, ప్రజలతో కలిసి ప్రచారం చేశారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి : స్పీకర్

వికారాబాద్/నవాబుపేట/ధారూరు : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎస్ఏపీ మైదానంకు వెళ్లిన స్పీకర్ వారితో కలిసి నడిచి వారితో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్సీ కొంపల్లి యాదవరెడ్డి అన్నారు. నవాబుపేట మండలం ఎక్మామిడి, ఎల్లకొండ, లింగంపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇన్‌చార్జి భీంభరత్, మండలాధ్యక్షుడు వెంకటయ్య, తదితరులున్నారు. రంజిత్‌రెడ్డిని గెలిపించేందుకు ధారూరు మండలంలోని పలు గ్రామాల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి ప్రచారం చేశారు. నాగారంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ జె.హన్మంత్‌రెడ్డి ఉపాధికూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు.

రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించాలి

కులకచర్ల/మర్పల్లి/పెద్దేముల్ : రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించాలని ఆయన తనయుడు సిద్ధార్థరెడ్డి ప్రచారం నిర్వహించారు. కులకచర్ల మండలం ఇప్పాయిపల్లిలో ప్రచారం నిర్వహించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. సొసైటీ చైర్మన్ మొగులయ్య, మండలాధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులున్నారు. రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మర్పల్లి మండలం పిల్లిగుండ్లలో ఇంటింటి ప్రచారం చేసి, ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. కొండల్‌రెడ్డి, సుభాష్‌యాదవ్, కృష్ణారెడ్డి, కలీముద్దీన్, సంజీవరెడ్డి, రాచన్న, అశోక్, ప్రభాకర్, మండలాధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, దుగ్గాపూర్, మదనంతాపూర్, నెల్లిగడ్డతండా, కొండాపూర్ తదితర గ్రామాల్లో రంజిత్‌రెడ్డి గెలుపుకోసం ఎస్సీసెల్ అధ్యక్షులు కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డి, ఎస్టీసెల్ మహిళా అధ్యక్షురాలు సుమిత్ర ఇంటింటి ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ ఎంపీటీసీ

శంషాబాద్ రూరల్ : కవ్వగూడ మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, రామాంజాపూర్ మాజీ ఎంపీటీసీ క్రాంతికుమార్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అధ్వర్యంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు 100 మంది బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు పార్టీలో చేరారు. మండల ఉపాధ్యక్షుడు రమేష్, నర్కూడ మాజీ ఎంపీటీసీ గౌతమిఅశోక్, తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నిల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

చేవెళ్ల/కందుకూరు : బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, టీజేఎస్ చేవెళ్ల ఇన్‌చార్జి వినయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, సీపీఎం డివిజన్ కార్యదర్శి దేవేందర్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీలు, అనుబంధ సంఘాలన్నీ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు. మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఎం.సత్తిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. కందుకూరు మండలం నేదునూరు మాజీ ఎంపీటీసీ ఉన్ని వెంకటయ్యతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రూప్‌చందర్, లేమూరులో ఎలుక సురేందర్‌రెడ్డి, అన్నోజిగూడ నుంచి డిల్లీ కృష్ణ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ జంగారెడ్డి, తదితరులున్నారు.

కుండపోత!

మర్పల్లి మండలంలో కురిసిన భారీ వర్షం



రోడ్డుపై పారుతున్న వరదనీరు

మర్పల్లి, మే 10: మర్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని పలు గ్రామాల్లో శుభకార్యాలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మర్పల్లిలో పెళ్లి అనంతరం భోజనం చేసే క్రమంలో ఈదురుగాలులతో కుండపోత వానం కురియడంతో టెంట్లు కూలిపోయి బంధువులపై పడిపోయాయి. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. జొన్న, ఉల్లి పంట దెబ్బతిన్నాయి. పొలాల దగ్గర నిల్వ ఉంచిన ఉల్లి పంట తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆలయంలో వేయి కలశాలతో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

లోక కల్యాణానికి సహస్ర ఘటాభిషేకం

ఘట్‌కేసర్ రూరల్, మే10: లోక కల్యాణం కోసమే సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నట్లు రంగనాయకస్వామి దేవాలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని గోదాసమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి దేవాలయంలో శుక్రవారం సహస్ర ఘటాభిషేకం(వెయ్యి కలశాలతో) నిర్వహించారు. ఉదయం కలశ ఆవాహనం, కలశఆరాధన, మూలమంత్ర హవానం, అనంతరం ఆలయంలోని అద్దాల మేడలో స్వామివారికి వేయి కలశాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఒడి బియ్యం, మొక్కులు చెల్లించుకున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం

మాజీమంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి



పరిగిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పి.సబితారెడ్డి

పరిగి/పెద్దేముల్/బషీరాబాద్/వికారాబాద్/నవాబుపేట/తాండూరు రూరల్/దోమ మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పరిగిలోని ఎస్ గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో వణుకు పుట్టిందని విమర్శించారు. రేవంత్‌పాలన ఐదునెలల్లోనే గాడి తప్పిందని విమర్శించారు. పదేళ్ళుగా రాష్ట్రాన్ని పటించుకోని బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులను జాతీయహోదా కల్పించాలని వందలసార్లు మొత్తుకున్నా పట్టించుకోని వారు ఎన్నికల కోసం పాలమూరుకు జాతీయహోదా కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి గారడీ మాటలు తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రుణమాఫీ రెండుసార్లు వాయిదావేసి ఇప్పుడు ఆగస్టు 15అని కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, శ్యాంసుందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సబితారెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, కులాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీని నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వామి గౌడ్, దీపనర్సిములు, రాజుగౌడ్ పాల్గొన్నారు. కాగా, వికారాబాద్ పట్టణంలోని 24, 25, 26 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ప్రచారం నిర్వహించారు. నవాబుపేట మండలం గంగ్యాడలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రశాంత్, రామ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా తాండూరు మండలం ఉద్దండాపూర్, గుండ్లమడుగు తండా, చిట్టిఘనాపూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో వికారాబాద్ జడ్పీటీసీ ప్రమోదిని కాసాని తరఫున ఇంటింటి ప్రచారం చేశారు. దోమ మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు కె.రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. మైను, బండి సాయి, పాల సంఘం డైరెక్టర్ పెంటయ్య, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి ఒక్క అవకాశం ఇవ్వండి

కందుకూరు, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుండి బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు కోరారు. శుక్రవారం ఆపార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావుపల్లి, అన్నోజిగూడ గ్రామాలలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆ పార్టీ నేతలు జి.లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కాకి దశరథలతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నోజిగూడలో 20మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేఘనాథ్‌రెడ్డి,ఎస్ సుదర్శన్‌రెడ్డిబ, కొండల్‌రెడ్డి,పొట్టి ఆనంద్, రామకృష్ణ, బర్కం వెంకటేష్, డి.రమేష్, పి.మహేందర్, సురేష్, జైపాల్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

చేవెళ్ల : ఎన్నికల్లో కాసానిని గెలిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం తంగడ్‌పల్లి, మడికట్టు గ్రామాలతోపాటు పట్టణ కేంద్రంలోని పలు కాలనీల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు శేరి శివారెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, కందవాడ ఎంపీటీసీ రవీందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

దేశ అభివృద్ధికి మోదీని గెలిపించుకోవాలి



మహేశ్వరం: హర్శగూడలో గిరిజన దుస్తులు ధరించి ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

మహేశ్వరం/శంకర్‌పల్లి/షాబాద్, మే 10: దేశ అభివృద్ధి, సంక్షేమానికి నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా గెలిపించుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలను నమ్మించడానికి అమలుకాని హామీలు ఇస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 400పైగా ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీలో ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువబోతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.పాపయ్యగౌడ్, కడారి జంగయ్యయాదవ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, టి.యాదీష్, దేశ్యానాయక్, మాదవాచారి, ముత్యం, సామయ్య, శ్రీశైలం పాల్గొన్నారు. అదేవిధంగా శంకర్‌పల్లిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. షాబాద్ మండలంలో లింగారెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, మన్‌మర్రి, బోడంపహాడ్, అంతారం, కేసారం, కక్కులూరు, సర్దార్‌నగర్, కుర్వగూడ తదితర గ్రామాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, మండల అధ్యక్షుడు దాదె మహేష్‌లు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్: చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు మిట్ట లతారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌తోపాటు 300 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు ఎం.వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవుని శర్వలింగం, రాములు, మధుకర్‌రెడ్డి, రాజేశ్, రాములు, ఆశోక్, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మొయినాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల పరిధిలో 200 మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో అజీజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

తాండూరు రూరల్/యాలాల/నవాబుపేట/ధారూరు: చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు మండల బీజేపీ నాయకులు, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జి.సాయిరెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాస్నం మైపాల్‌రెడ్డి, శ్రీకాంత్, కుర్వ మల్లమ్మ, ఉపాధి కూలీలు ఉన్నారు. అదేవిధంగా యాలాల మండల వ్యాప్తంగా ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా జక్కేపల్లి, గిరిజాపూర్, పేర్కంపల్లి, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమై బీజేపీ విజయానికి ప్రణాళికలు రూపొందించారు. అదేవిధంగా దేవనూర్, అగ్గనూర్, తిమ్మాయిపల్లి, దవలాపూర్, గిర్మాపూర్, యాలాల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ అజయ్ ప్రసాద్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా జానీ మాదిగ, డప్పు మహేంద్ర మాదిగ, సూర్య ప్రకాష్ మాదిగ ఉన్నారు. అదేవిధంగా నవాబుపేట మండలంలోని పూలపల్లి, నారేగూడ, గంగ్యాడ, అక్నాపూర్ గ్రామాల్లో పార్టీ మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ధారూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమేశ్, పాండుగౌడ్, వివేకానంద రెడ్డి, రాజేందర్ గౌడ్, విశ్వనాథం పాల్గొన్నారు.



అజీజ్‌నగర్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

పోలింగ్ సజావుగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 10 : ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా అవగాహన కల్పించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి సమాచారం అందించాలన్నారు. ఈవీఎంల విషయంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని, పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన సామగ్రిని అందించారా? లేదా అని చెక్ చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు తరువాత మాక్ పోల్ జరిపించాలని సూచించారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెను వెంటనే ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. డాక్యుమెంట్, పీవో డైరీ, విజిట్ షీట్, మాక్‌పోల్ సర్టిఫికెట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పులు లేకుండా సక్రమంగా పూరించేలా పరిశీలన జరపాలన్నారు. మున్సిపల్ జోనల్ కమిషనర్ సహాయ రిటర్నింగ్ అధికారి స్నేహ పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు కలగొద్దు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మే 10: పోలింగ్ నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వికారాబాద్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, సెక్టోరల్ అధికారులతో పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 284 పోలింగ్ కేంద్రాలున్నాయని, జిల్లాలోని 26 మంది సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్ ఉన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి రాజీవ్ చావ్ ర అన్నారు. లోక్ సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎన్‌జీఆర్ఎస్, ఎలక్షన్ కంట్రోల్ రూమ్, సి విజిల్, ఎంసీఎంసీ కేంద్రాలను పరిశీలించారు. వ్యయ పరిశీలకులతో పాటు డీఆర్‌డీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బషీరాబాద్/పరిగి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పన బాధ్యత ఆయా గ్రామాల కార్యదర్శులదేనని బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎంపీవో రమేష్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బషీ రాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య శుక్రవారం పరిశీలించారు. అదేవిధంగా పరిగి మున్సిపల్ పరిధి, సుల్తాన్‌పూర్, మల్లేమోనిగూడలోని పోలింగ్ కేంద్రాలను ఏఆర్వో, ఆర్డీవో ఎం.వాసుచంద్ర శుక్రవారం పరిశీలించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

పరిగి: పరిగి అసెంబ్లీ నియోజవకర్గానికి సంబంధించి 305 పోలింగ్ స్టేషన్‌లకు ఎన్నికల సామగ్రిని పరిగి మినీస్టేడియం మైదానం నుంచే పంపిణీ చేయనున్నారు. అందుకు ఏఆర్వో, ఆర్డీవో ఎం.వాసుచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. పీఎస్‌ల వారీగా ప్రత్యేక కౌంటర్ల కోసం ఏర్పాటు, సిబ్బంది కూర్చోవడానికి టెంట్లు వేశారు. శుక్రవారం ఆర్డీవో వివిధ మండలాల వారీగా పంపిణీ చేసే ఇన్‌చార్జిలు, సిబ్బందితో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

మద్యం విక్రయాలు బంద్

తాండూరు: ఈనెల 13న పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మద్యం విక్రయాలు నిషేధించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 188చట్ట ప్రకారం 48 గంటల ముందు నుంచి లిక్కర్ అమ్మకాలు బంద్ చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పెరిగిన పోలింగ్ సమయం

తాండూరు: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో తీవ్ర ఎండల దృష్ట్య కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని పెంచింది. ఈనెల 13న జరుగనున్న పోలింగ్ ప్రారంభం ఎప్పటి మాదిరిగానే ఉదయం 7గంటలకు ప్రారంభం కానుండగా పోలింగ్ ముగింపు సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 6గంటలకు పొడిగించింది.

మేడ్చల్‌లో ఓటరు చైతన్య ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ జరిగేవిధంగా శుక్రవారం గ్రామాల్లో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గౌతం అదేశాల మేరకు జిల్లాలోని అయా గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో 118 గ్రామ సమాఖ్యలు, 3,384 స్వయం సహాయక సంఘాల ద్వారా పదివేల మంది మహిళలు ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ఓటర్లను చైతన్యం చేశారు.

17 స్థానాల్లో విజయం సాధిస్తాం


హెలిప్యాడ్ వద్ద పరిశీలిస్తున్న జనార్దన్‌రెడ్డి

వికారాబాద్, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో 17స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జనార్దన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఏపీ కళాశాలలో జరుగబోయే అమిత్‌షాసభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ స్థానం 1991నుంచి గెలిచే అవకాశమున్న కారణాలతో ఓడుతూ వచ్చిందన్నారు. ఈసారి మాత్రం తప్పనిసరిగా చేవెళ్ల గడ్డపై గెలుపొందుతుందన్నారు. శనివారం జరిగే అమిత్‌షాసభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశ్వేశ్వర్‌రెడ్డి చదువుకున్న వ్యక్తి అని అభివృద్ధిపై ఆలోచన ఉన్న నాయకుడని తెలిపారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు వర్ధనందు, కేపీ రాజు, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టెక్‌హ్యాక్-3 పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్ రూరల్, మే 10: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం టెక్‌హ్యాక్-3 పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల 28 నుంచి 30 వరకు జరిగే టెక్‌హ్యాక్ కార్యక్రమంలో అందరు పాల్గొనాలని స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెచ్‌వోడీ జీ. విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

పరిగి, మే 10: పట్టణానికి వచ్చిన సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం ఆర్టీసీ యూనియన్ నాయకులు కలిశారు. పరిగిలోని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఎస్‌డబ్ల్యూ-ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కె.హన్మంత్‌ముదిరాజ్, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్, సలహాదారులు యాదయ్యలతో కలిసి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యపై వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వారి వెంట డీసీసీ ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ, పరశురాంరెడ్డి ఉన్నారు.

లక్ష్యాలను ఎంచుకుని ముందుకెళ్లాలి


తాండూరు, మే 10: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ముందుకెళ్లాలని తాండూరు ఆచార్య రంగ వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ సూచించారు. తాండూరు శాలివాహన డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. వక్త నారాయణరెడ్డి, కళాశాల ప్రెసిండెంట్ నాగారం నర్సింహులు, కరస్పాండెంట్ అనురాధ రమేష్, ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ శరత్‌చంద్ర, అకాడమిక్ డైరెక్టర్ సిద్ధిలింగయ్య, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి, కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు మాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి


అత్వేల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వజ్రేష్ యాదవ్

మేడ్చల్ టౌన్/కీసర, మే 10: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునిత మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ కోరారు. మేడ్చల్ మండలంలోని పలు గ్రామాలతో పాటు, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కీసర మండలంలోని గోధుమకుంట గ్రామంలో ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీణ్ అధ్వర్యంలో శుక్రవారం గోధుమకుంట గ్రామంలోని హెవెన్‌డౌన్ కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరారు.

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, మే 10: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండల పరిధి తిమ్మాయిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రచారం చేపట్టారు.

సమసమాజ స్థాపనకు బసవేశ్వరుడి కృషి


వికారాబాద్‌లో బసవేశ్వరుడి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

వికారాబాద్/ధారూరు/తాండూరు/కొడంగల్/బొంరాస్‌పేట్/దౌల్తాబాద్, మే 10: సమసమాజ స్థాపనకు మహాత్మా బసవేశ్వరుడు ఎంతో కృషి చేశాడని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బసవేశ్వర జయంతి సందర్భంగా శుక్రవారం ఎన్నెపల్లిలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆలంపల్లిలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, విజయ్, బస్వరాజ్ సభ్యులు శుభప్రద్ పటేల్, అప్ప విజయ్, బస్వరాజ్ పటేల్, విశ్వనాథం సత్యనారాయణ, జ్యోత్స్న పాల్గొన్నారు. వికారాబాద్‌లోని బసవ విగ్రహానికి పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె. బాబ్యానాయక్, రాష్ట్ర కార్యదర్శి వీరేశం పాల్గొన్నారు. అదేవిధంగా ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో వీరశైవ సమాజ బాధ్యులు బసవేశ్వరుని విగ్రహానికి పూజలు చేసి హారతినిచ్చి మొక్కుకున్నారు. బసవచౌక్ వరకు ర్యాలీగా వెళ్లి బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదానం చేశారు. అదేవిధంగా తాండూరు పట్టణం ఇందిరాచౌక్‌లో నున్న బసవేశ్వరుడి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పూలమాల వేశారు. కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర చిత్రపటానికి పూజలు చేశారు. ఇందిరాచౌక్‌లోని బసవేశ్వర విగ్రహానికి రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పూలమాలవేసి నివాళులర్పించారు. కొడంగల్ పట్టణంలోని శ్రీ మహదేవ శివాలయంలో మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి బసవేశ్వర చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు రేగడిమైలారం, దుద్యాల గ్రామాల్లో వీరశైవ సమాజం సభ్యులు శుక్రవారం బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. దౌల్తాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వరస్వామి జయంతి సందర్భంగా వీరశైవ సమాజం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు నాగభూషణం, యువజన అధ్యక్షుడు ఆవుటి రాకేశ్‌శర్మ, సభ్యులు పాల్గొన్నారు. పరిగిలో వీరశైవసమాజం అధ్యక్ష కార్యదర్శులు గుడ్ల శివరాజ్, ప్రమత మాణిక్యం బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కులకచర్లలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా బసవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు పాల్గొన్నారు. చౌడాపూర్ మండలంలోని మందిపాల్ గ్రామంలోని ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వరుడి జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా


ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న వెంకటాపూర్ ఎంపీటీసీ రామారావు


మచ్చబొల్లారం డివిజన్ పలు కాలనీ సభ్యులతో సమావేశమైన ఈటల రాజేందర్


మచ్చబొల్లారం/మల్లాపూర్/కాప్రా, మే 10 : తనను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని పలు కాలనీల సభ్యులతో శుక్రవారం ఈటల సమావేశమయ్యారు. మల్కాజిగిరి ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. కాగా ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఆయన సతీమణి ఈటల జమున పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ గుల్మోర్ గార్డెన్స్‌లో కాలనీవాసులతో ఆమె సమావేశమయ్యారు. అంతేకాకుండా ఈటల రాజేందర్ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి తదితరులు బీజేపీలో చేరగా బేతి సుభాష్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మోదీని మూడోసారి ఆదరించాలి

ఘట్‌కేసర్ రూరల్ : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని మూడో సారి ప్రధానమంత్రి చేయాలని అ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. వెంకటాపూర్ ఎంపీటీసీ నీరుడి రామారావు తన 100 మంది అనుచరులతో ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే బీజేపీనే గెలిపించాలన్నారు.ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటల సమక్షంలో బీజేపీలో చేరిక

వనస్థలిపురం: ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చడానికి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు బీజేపీలోకి చేరడం తన విజయం ఖాయమైందని ఈటల రాజేందర్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు టైగర్ విజయ్‌తో ఆయన అనుచరులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర పార్టీల నాయకులు తన గెలుపు కోసం బీజేపీలో చేరడం హర్షనీయమన్నారు. బీజేపీ నాయకులు చిన్న యాదవ్, కౌశిక్ మహర్షి, వినీల్, భార్గవ్ తేజ, భగీరథ పాల్గొన్నారు.


వనస్థలిపురం: ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

రాజేందర్‌ను గెలిపించండి: ఈటల జమున

రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులు ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేందర్ సతీమణి జమున అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో జమున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని బలపర్చడానికి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాజేందర్‌కు అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతీఒక్కరు మరింత కష్టపడి అత్యధిక మెజార్టీకి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పోచంపల్లి గిరధర్, తడకమళ్ల రవి కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం

బొంరాస్‌పేట్/దౌల్తాబాద్, మే 10: దుద్యాల మండలంలోని లగచర్ల, దుద్యాల, పోలెపల్లి, బొంరాస్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, బొంరాస్‌పేట్, నాందర్‌పూర్, తుంకిమెట్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, ఆవుటి శేఖర్, మెరుగు వెంకటయ్య, జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, నర్సిములు నాయుడు, సంతోష్, వీరేశం, శ్రీనివాస్ తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దౌల్తాబాద్ మండలంలోని సుల్తాన్‌పూర్, దేవరఫస్లాబాద్, గోకఫస్లాబాద్, దౌల్తాబాద్, సురయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ప్రమోద్‌రావు, వెంకట్రావ్, బోడి వెంకట్‌రెడ్డి, ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

కొడంగల్/దోమ, మే 10: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. మండలంలోని అంగడిరైచూర్, లక్ష్మీపల్లి, బాపన్‌చెరువు తండాతో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు శుక్రవారం గోవిందు, చిన్న, లక్ష్మణ్‌నాయక్ తదితరులు తిరుపతిరెడ్డి సమక్షంలో కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ పాల్గొన్నారు. దోమ మండలంలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన మల్లెపల్లి అశోక్, దిర్సంపల్లి తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ సోమ్లనాయక్, శివరాంనాయక్, దేవ తదితరులు శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు

హమాలీల కొరత లేకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్ రూరల్, మే 10: ఎదులాబాద్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో 15మందే హమాలీ కూలీలు ఉండగా ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. ఈ విషయమై 'కాంటాలేవి?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం అదనంగా మరో 29మంది హమాలీ కూలీలను ఏర్పాటు చేసి ధాన్యం లోడింగ్ చేపట్టారు. 440మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 37మంది రైతుల వద్ద కొనుగోలు చేశారు. వీరిగా రూ.97లక్షలకు గాను రూ.80లక్షలను రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. మాదారం సెంటర్‌లో గతంలో 15మంది పనిచేయగా శుక్రవారం నుంచి 24మంది హమాలీలు పనిచేస్తూ ధాన్యాన్ని సేకరిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉండటం వల్ల హమాలీల కొరత వచ్చిందని డీసీఎంఎస్ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎక్కువగా బిహార్ నుంచి హమాలీలు వస్తారని అక్కడ ఎన్నికలు ఉండటం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి విక్రం, వెంకట్రాజన్, రైతులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో హమాలీల పనితీరును పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

క్రైం కార్నర్

బీఆర్ఎస్ సమావేశానికి వచ్చిన వృద్ధురాలి మృతి

పరిగి, మే 10: పరిగిలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరైన ఓ వృద్ధురాలు మృతి చెందింది. పరిగి మునిసిపల్ పరిధిలోని ముదిరాజ్‌కాలనీకి చెందిన టప్ప చంద్రమ్మ(77) పరిగిలోని ఎస్‌గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి కాలనీ వాసులతో కలిసి వచ్చింది. భోజనం చేసిన తర్వాత సమావేశంలో కుర్చీపై కుర్చింది. ఆకస్మాత్తుగా సొమ్మసిల్లి కిందపడిపోయింది. తోటి మహిళలు, కుటుంబీకులతో కలిసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే వృద్ధురాలు ఇటీవలే కంటిశస్త్రచికిత్స చేయించుకుంది. విశ్రాంతిలో ఉన్న చంద్రమ్మ కాలనీవాసులతో కలిసి సమావేశానికి వచ్చి మృతి చెందడం విచారకమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పూడూరు, మే 10: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓవ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ మండలం మోమిన్ కలాన్‌కు చెందిన జమాలుద్దీన్(43) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన కూతురు వివాహం కావడంతో ఈనెల 6వ తేదీన బంధువులకు పెళ్లిపత్రికలు ఇచ్చేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. పత్రికలు ఇచ్చి తిరిగి కండ్లపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న కారు జమాలుద్దీన్ బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై నుంచి కిందపడి జమాలుద్దీన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బాధితున్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ మధు సూదనరెడ్డి తెలిపారు. మృతుడి భార్య బేబన భేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుంటలో దర్జాగా మట్టి దందా

శామీర్‌పేట, మే 10: మండలంలోని మురహారిపల్లిలో మట్టిదందా జోరుగా సాగుతోంది. మురహారిపల్లి పరిధిలోని రైని కుంటలో కొందరు వ్యాపారులు మట్టిని అక్రమంగా తరలిస్తు దందాచేస్తున్నట్లు స్థానిక ప్రజలు ఇరిగేషన్ శాఖకు చెందిన మండల ఏఈ ప్రశాంత్‌కుమార్‌కు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమలతకు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు అధికారులు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్, ఆర్ఐ సుమలతలు అక్కడికి శుక్రవారం వెళ్లి పరిశీలించగా జేసీబీతో మూడు ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు జేసీబీని సీజ్‌చేసి మురహారిపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలోకి తరలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ మండల ఏఈ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు.

పిడుగుపాటుకు గేదె మృత్యువాత

పరిగి, మే 10: పిడుగుపాటకు ఓ గేదె మృత్యువాతపడింది. ఈదురు గాలులతో పడిన పిడుగుపాటుకు పరిగి పట్టణానికి చెందిన గోల్ల రామయ్యకుచెందిన గేదె మృతిచెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూకబ్జాకు యత్నం

- నిందితుల అరెస్టు

కీసర రూరల్, మే 10: నకిలీ డాక్యుమెంట్‌తో భూకబ్జాకు యత్నించిన నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటయ్య తెలిపిన కథనం ప్రకారం.. సఫిల్‌గూడకు చెందిన గౌలికర్ రాజేంద్రప్రసాద్, లాలాపేట్‌కు చెందిన దారం సాయినాథ్, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన మాదాడి సంగీత, లాలాపేట్ వాసి గౌలికర్ మణికంఠతో పాటు మరి కొంత మంది కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి నగరంలో నివసిస్తున్న మున్ని రాణి తండ్రికి చెందిన కీసర మండలం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 381 నుండి 384, 387లో ఏర్పాటు చేసిన లక్ష్మినగర్ కాలనీలోని ప్లాట్ నంబర్ 373లోని 500చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు. ఇందుకు లాలాపేట్‌లో ఉంటూ కూలిపని చేసుకునే పద్మ పేర నకిలీ దస్తావేజును సృష్టించారు. ఆతర్వాత పథకం ప్రకారం పద్మ నుండి కొనుగోలు చేస్తున్నట్లుగా రాజేంద్రప్రసాద్ పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ నుంచి మాదాడి యుగెందర్‌రెడ్డి పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అతను రూ.60లక్షలకు వైశాలికి విక్రయించారు. ఇదిలా ఉండగా మున్ని రాని ఆన్‌లైన్‌లో ఈసీ సెర్చ్ చేయగా వారి ప్లాట్ నంబర్‌పైన మరొకరి పేరు ఉండటంతో వెంటనే కీసర పోలీసులను ఆశ్రయించింది. విచారణ చేపట్టిన పోలీసులు కూపీ లాగారు. అందులో భాగంగా రాజేంద్రప్రసాద్, దారంసచిన్, మాదాడి సంగీత, గౌలికర్ మనికంఠలను అదుపులోకి తీసుకున్నారు. కాగా పాత్రదారులైన మహేష్, సోమ్‌నాథ్, ముక్క ఆంజనేయులు, రాంసింగ్, యుగెందర్‌రెడ్డిలు పరారీలో ఉన్నారు.

మోత్కూర్‌లో వీధి నాటకం


వీధి నాటకానికి హాజరైన కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

దోమ, మే 10: మండలంలోని మోత్కూర్‌లో గురువారం రాత్రి నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర మహత్యం వీధి నాటకానికి కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, కృష్ణయ్య, దోమ నర్సిములు, దండు వెంకటయ్య, మహేశ్, కృష్ణ, రాములు, బాల్‌రాజ్, వెంకటయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ


కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, మే 10: కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అనారోగ్యం బారిన పడి కోలుకోవడంతో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కొడంగల్‌లో పలువురు నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పలువురు పేదలకు 10కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దౌల్తాబాద్, మే 10: మండల కేంద్రానికి చెందిన ముస్లిం సోదరుడు ఎండీ. సలీం కిరణా దుకాణంలో గత రెండు రోజుల కిందట షార్ట్‌సర్క్యూట్‌తో దాదాపు రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, దస్తప్ప మంజుల పాల్గొన్నారు.

రుణాలు పొంది చెల్లించని డైరెక్టర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఘట్‌కేసర్, మే 10: ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొంది కిస్తులు తిరిగి చెల్లించకుండా డిఫాల్టర్లు అయిన డైరెక్టర్ల సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డైరెక్టర్ బీరెడ్డి స్రవంతి శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. సహకార సంఘం డైరెక్టర్లుగా ఎన్నికైన సీహెచ్ ధర్మారెడ్డి, గ్యార వెంకటేష్, గోపు బాల్‌రాజ్, లక్ష్మమ్మ సంఘంలో రుణాలు తీసుకొని చెల్లించకుండ డిఫాల్టర్ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు, మే 10: పూడూరు మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి షెడ్యూల్ విడుదలైనట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీగ్రూపుల్లో 40సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంగ్లిష్ మీడియంలో మొత్తం 160సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2023-2024లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 10 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం విద్యార్థుల ఎంపిక ఉంటుంది. బాలికలకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఉచిత హాస్టల్, ఉచిత పాఠ్య పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.